ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు

సోమవారం 17 జూన్ 2024



'నామినేటెడ్' భర్తీ ఎప్పుడు?

- స్థానిక ఎన్నికలకు ముందా.. తర్వాతనా..?
- కాంగ్రెస్ నేతల ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులపై ఆ పార్టీ ద్వితీయ, తృతీయశ్రేణి నేతల్లో ఆశలు పెరిగాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు అధికారానికి దూరమై ఉనికికోల్పోయిన నేతలంతా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఊపిరిపీల్చుకున్నారు. మళ్లీ తమ రోజులు వచ్చాయని ఒక నెల అటూ ఇటుగా నామినేటెడ్ పదవులు తమను వరించబోతున్నాయని ఆశలు పెంచుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగగానే పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చింది. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ అంశం వెనక్కిపోయింది. జిల్లా పరిధిలో సుడా చైర్మన్, డైరెక్టర్ పదవులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, పాలకవర్గ పదవులు, మార్కెట్ కమిటీలు, ఆసుపత్రుల కమిటీల, దేవాలయ కమిటీల చైర్మన్, పాలకవర్గ సభ్యుల పదవులను నియమించే అవకాశమున్నది. రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్ పదవులు, డైరెక్టర్ల భర్తీ చేయాల్సి ఉన్నది. జిల్లాలో ఉన్న కాంగ్రెస్ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తమతమ స్థాయిని బట్టి నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ నేతలకు రాష్ట్ర ఐడీసీ చైర్మన్, ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బీసీ కమిషన్ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్, మానవ హక్కుల కమిషన్ సభ్యుల తదితర పదవులు దక్కాయి. జిల్లాకు రాష్ట్రంలో ఉన్న రాజకీయ ప్రాధాన్యం దృష్ట్యా ఇక్కడ నుంచి పలువురికి రాష్ట్రస్థాయిలో పదవులు దక్కుతాయని సీనియర్ నేతలు ఆశిస్తున్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి ఆ దిశగా ఆలోచనే చేయక పోవడంతో పదవుల పంపిణీ ఎప్పుడు ఉంటుందో, తమకు ఎప్పుడు ఆయోగం పడుతుందోనని నేతలు ఎదురు చూస్తున్నారు.

● అడ్డంకిగా స్థానిక ఎన్నికలు

వెంటనే నియామకాల ప్రక్రియ చేపట్టక పోతే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చి మరో ఆరు నెలలపాటు పదవుల పంపిణీ వాయిదాపడే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పదవుల భర్తీ చేస్తే అవి దక్కనివారు పార్టీకి స్థానిక ఎన్నికల్లో నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదు. ఎన్నికల తర్వాత పదవుల భర్తీ చేపడితే నాయకులందరూ పార్టీ విజయానికి కృషి చేస్తారనే అభిప్రాయం నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే 2025లో నామినేటెడ్ పదవుల భర్తీ జరిగే అవకాశమున్నది. బీఆర్ఎస్ హయాంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం జాప్యం చేయడం, భర్తీ చేయాలనుకున్న సమయంలో ఎన్నికలు, ఇతరత్రా అంశాల ఆటంకాలు ఏర్పడడంతో చాలా పదవులు అసలు భర్తీకే నోచుకోలేదు. మూడు విడతలుగా నియామకాలు జరిగే అవకాశమున్నా ఒకటి రెండు సార్లు మాత్రమే పదవుల భర్తీ జరిగింది. కొందరికి రెండేసిసార్లు అవకాశాలు లభించగా కొందరి ఆశలే నెరవేరకుండా పోయాయి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇలాంటి పరిస్థితే పునరావృతమవుతుందా, అలా అయితే తమ పరిస్థితి ఏమిటీ అని ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

● సుడా చైర్మన్ సంగతేంటి?

గత మార్చి 15న ప్రభుత్వం 37 మంది నేతలను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో రావడంతో ఆయా చైర్మన్లుగా నియమితులైనవారు పదవీ బాధ్యతలను స్వీకరించలేదు. ఇటీవల ఎన్నికల కోడ్ ముగిసినా ఈ మధ్యకాలంలో ఈ నామినేటెడ్ పదవుల విషయంలో పలువురు నాయ కులు, ఎమ్మెల్యేలు, మంత్రిస్థాయి ఉన్న వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ఆ నియామకాల వ్యవహారం కోల్డ్ స్టోరేజీకి చేరింది. ఆ చైర్మన్ పదవులు ఉన్నట్టా లేనట్టా అనే విషయంలో కూడా ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. ఆ జాబితాలో జిల్లాకు చెందిన సుడా చైర్మన్ పదవి ఉన్నది. ఈ పదవిలో జిల్లాకు చెందిన సీనియర్ నాయ కుడు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని నియమించారు. ఆయన తన నియామకం జరిగిన తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఇతర మంత్రులను కలిసి వారికి ధన్యవాదాలు తెలిపి సత్కరించి వచ్చారు. ఇప్పటికీ ఆయన పదవీ బాధ్యతలు మాత్రం చేపట్టలేదు. ఆ పదవి ఉన్నట్టా... లేనట్టా అనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. జిల్లా నుంచి నియమించి ఒక్క పోస్టు పరిస్థితి ఇలా ఉండగా ఇతర నామినేటెడ్ పదవులు ఎప్పుడు భర్తీ చేస్తారోనని నాయకులు ఎదురుచూస్తున్నారు.

నేడు బక్రీద్



సాలేహ్‌నగర్ ఈద్గా వద్ద తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ పోలీసులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 16: ముస్లింలు సోమవారం (ఈద్ ఉల్ జుహా) బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. నగరంలోని పురానీ, రేకుర్తి సాలెహ్‌నగర్ ఈద్గాలతో పాటు కొత్తపల్లి, చింతకుంట, బైపాస్ రోడ్ ఈద్గాల్లోలో సామూహిక ప్రార్థనలు జరుగనున్నాయి. నగరంలోని ప్రధాన మసీదులతో పాటు గ్రామాలు, మండల కేంద్రాలలోని మజీద్‌లలో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ సందర్భంగా మార్కెట్‌లో, శివారు ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల అమ్మకాల సందడి నెలకొంది. పలు కూడళ్లలో గ్రామాల నుంచి విక్రయదారులు గొర్రెలు, మేకలు తీసుక వచ్చి అమ్ముతుండగా గిరాకీ పెరిగింది.

బిల్లులు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య

సుభాష్‌నగర్, జూన్ 16: రెండు సంవత్సరాలుగా తమకు రావాలసిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు లక్షల రూపాయల బిల్లులు కూడా పాస్ కావడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బిల్లులు పాస్ కావడం లేదన్నారు. 30 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఏనాడు రాలేదన్నారు. అన్ని రకాల కాంట్రాక్టర్లు బిల్లులు రాక, ఇంట్లోవాళ్ల బంగారం తాకట్టుపెట్టి పనులను పూర్తి చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్రకూడా ఉందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కాంట్రాక్టు పనులు చేసిన వారి బిల్లులు చెలించి, స్థానికులను ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే కలెక్టరేట్ల ఎదుట దర్నాలు, హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల మోహన్, ప్రధానకార్యదర్శి రోసెల్లి కిషన్‌రావు, చీఫ్ అడ్వైజర్ కొప్పుల అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చిందం శ్రీనివాస్, కోశాధికారి పి రామచంద్రం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ దుర్గం మహేందర్‌రాకేశ్, కార్యదర్శి ఆనందరావు, ఒర్సు బిక్షపతి, గంట శివకుమార్, కాడె శంకర్, హన్మండ్ల ప్రభాకర్, గుడ్డూరు నర్సయ్య, ఒర్సు కుమారస్వామి, జి కృష్ణారావు, ఈ శివారెడ్డి, సిహెచ్ రవిందర్‌రెడ్డి, బి ప్రకాశ్‌రావు, ఎస్ సునీల్‌కుమార్, బి శేఖర్, బడ్డె మదన్‌మోహన్‌రెడ్డి, దర్సింగ్, జగత్పాల్‌రెడ్డి, బద్దం హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్..



చిగురుమామిడిలో ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలను తీసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, జూన్ 16: ప్రజా సమస్యలను పరిష్కారించడమే తన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనకు ప్రజా సేవ చేయడానికి చక్కటి అవకాశం ఇచ్చారని, తానే స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు విని పరిష్కారిస్తానని అన్నారు. నియోకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే విధంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సేవలందిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జడ్పీ ఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్, కాంగ్రెస్ నాయకులు చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, సాంబారి బాబు, కర్ణకంటి మంజులారెడ్డి, ముప్పిడి దేవేందర్‌రెడ్డి, పోలు స్వప్న, పచ్చిమట్ల లక్ష్మి, ఓరుగంటి భారతిదేవి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులతో కళకళ

- బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం
- మూసివేసిన సర్కారు బడులు తెరుచుకున్న వైనం

తిమ్మాపూర్, జూన్ 16: ప్రభుత్వం పాఠశాలలను బలోపేతంగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లి దండ్రులు ఆకర్షితులయ్యేలా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తే 50 వేల నుంచి లక్ష రూపాయల ఖర్చు అవుతుందని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించుకునేందుకు తల్లి దండ్రులు ముందుకువస్తున్నారు.

మండలంలోని మక్తపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు ఎవ్వరూ రాకపోవడంతో 2016 సంవత్సరంలో పాఠశాలను మూసివేశారు. 2019లో తెరిచేందుకు ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. గ్రామంలో ఉన్న విద్యార్థులు చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లేవారు. ఈ విద్యా సంవత్సరం అధికారులు నిర్వహించిన బడి బాట కార్య క్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవ గాహన కల్పించడంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు ఒప్పుకున్నారు. దీంతో పాఠశాల తెరుచుకుని విద్యార్థులతో కళకళలా డుతోంది.

గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులు లేక గత విద్యా సంవత్సరం మూసి వేశారు. ఆ పాఠ శాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యా యులను పర్లపల్లి, పొలంపల్లి గ్రామాలలో ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఈ విద్యా సంవత్సరం అధికారులు చొరువ తీసుకొని గ్రామస్థుల సహకారంతో తిరిగి మూతపడిని పాఠశాలను తెరిపించారు. డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులను గొల్లపల్లి పాఠశాలకు రప్పించారు.



మక్తపల్లిలో తెరుచుకున్న పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సర్కారు బడితో ఫీజుల భారం తగ్గుతుంది..

- రజిత, మక్తపల్లి



ఇన్ని రోజులు వేలల్లో ఫీజులు కట్టి ప్రైవేట్ పాఠశాలకు పంపించాం. ఇప్పుడు గ్రామంలో సర్కారు బడి తెరవడం ఎంతో సంతోషంగా ఉంది. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలకు వేలల్లో ఫీజు కట్టి చదివించడం కష్టంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలకే మా పిల్లలనే పంపిస్తాం.

బడిబాటతో సత్ఫలితాలు

- శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో



బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నాం. గ్రామాల్లో తిరుగుతు మధ్యలో చదువు మానేసిన, ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న వారికి అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం అందిస్తోంది. మూసివేసిన పాఠశాలలను ప్రజల సహకారంతో తెరిచి విద్యార్థులను చేర్పిస్తున్నాం.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆయుష్ ఆర్‌డీడీ రవినాయక్



యోగా డే వాక్‌లో పాల్గొన్న నగరవాసులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 16: ప్రతి నిత్య యోగా చేస్తు ఆహారపు అలవాట్లు మార్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని ఆర్‌డీడీ రవినాయక్ అన్నారు. భారత్ స్వాభిమాన్, పతంజలి యోగా సమితి, యువ భారత్ మహిళ పతంజలి సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా వాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవితంలో మనిషి ఎన్నో ఒత్తిళ్లకు గురై శారీరక, మానసిక వ్యాధులకు లోనవుతున్నాడని అన్నారు. యోగాను జీవితంలో ఒక భాగం చేసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేశ్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో ఒక భాగమైన యోగా విద్యను ప్రపంచ వ్యాప్తంగా సాధన చేస్తున్నారని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పాటిస్తున్నారని అన్నారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్సీ ముఖ్య సంరక్షకుడు బూరుగుపెల్లి వేంకటేశ్వర్‌రావు, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, యువభారత్ జిల్లా అధ్యక్షుడు కొండ లక్ష్మణ్‌బాబు, మహిళ యోగా పతంజలి సమితి అధ్యక్షురాలు అలకానంద కార్వ, పి శ్రీనివాస్, విజయలక్ష్మి, మనోజ్‌ముందడ, సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, శేఖర్, గంగారావు, మధు పాల్గొన్నారు.

పడావుగా ప్రభుత్వ భూములు

- ప్రతిపాదనలతోనే సరిపుచ్చుతున్న సర్కార్
- యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



లెదర్ పార్క్ ప్రతిపాదిత స్థలంలో కబ్జాకు గురైన దారి

చొప్పదండి, జూన్16: కరీంనగర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం 1981లో పీజీ సెంటర్‌ను మంజూరు చేసింది. విశాలమైన స్థలం కోసం అధికారులు అన్వేషించారు. కరీంనగర్‌కు సమీపంలోని రుక్మాపూర్ వద్ద ప్రభుత్వ భూములను గుర్తించారు. అక్కడ 160 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా దానికి తోడుగా మరో 113 ఎకరాల పట్టా భూమిని రైతుల నుంచి సేకరించి మొత్తం 273 ఎకరాలను పీజీ సెంటర్ కోసం కేటాయించారు. అప్పటి కలెక్టర్ కేకేఎస్ శర్మ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఈ భూమిని రిజర్వ్ చేస్తూ 21 జూలై 1981 నాడు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని కారణాలతో పీసీ సెంటర్‌ను ఇక్కడి నుంచి తరలించారు. అప్పటి నుంచి నేటి వరకు ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. ప్రాజెక్టులు ప్రతిపాదిస్తున్నారు.. ఆ తర్వాత తరలిపోతున్నాయి. ప్రభుత్వ భూమిని కాస్త ఫలహారంగా పంచిపెడుతుండడంతో 273 ఎకరాల భూమి ఇప్పుడు 140 ఎకరాలకు కుదించుకుపోయింది. ఆ భూమి 35 ఏళ్లుగా పడావుగా ఉంది. చొప్పదండి మండలం రుక్మాపూర్ ప్రభుత్వ భూములపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

రుక్మాపూర్‌లో ప్రభుత్వ భూమిని గుర్తించి 43 ఏళ్లు దాటింది. మొదట పీజీ సెంటర్ కోసం కేటాయించిన భూములు ఇప్పుడు ఇతర సంస్థలకు, కొంతమంది మాజీ సైనికులకు కేటాయించారు. మరికొంత మంది అక్రమంగా భూములను సాగు చేస్తున్నారు. ఈ భూములు కరీంనగర్‌కు 12 కిలోమీటర్ల దూరంలో ఉండి, పరిశ్రమలకు అనకూలంగా ఉన్నాయి. పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఎప్పటికైనా ఏదైనా ప్రాజెక్టు రాకపోతదా అని ఏళ్ల తరబడి గ్రామస్తులు ఎదురు చూస్తుండగా నిరాశే ఎదురవుతుంది. ప్రతిసారి కరీంనగర్‌కు పరిశ్రమ మంజూరు కావడం, రుక్మాపూర్ భూములను ప్రతిపాదించడం, ఆ తర్వాత తరలిపోవడం షరా మామూలైపోయింది. కాకతీయ కాలువను ఆనుకుని ఉన్న ఈ విలువ కోట్లాది రూపాయలు ఉటుంది. భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



బెటాలియన్‌కు ప్రతిపాదించిన స్థలం

● ఇష్టారాజ్యంగా కేటాయింపులు

273 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఫలహారంగా పంచివేశారు. ఏదైనా సంస్థ ప్రభుత్వ భూమి కోసం దరఖాస్తు చేసుకోవడం, రెవెన్యూ అధికారులు ముందు చూపు లేకుండా కేటాయించడం మామూలైపోయింది. 1983లో సామాజిక వన నర్సరీకి భూమిని కేటాయించారు. ఇటీవల నాబార్డు ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంకు భూములను కేటాయించారు. ఒక్కో సంస్థకు ఒక్కో వైపునకు స్థలం కేటాయించడంతో మధ్యలో ఖాళీ స్థలం మిగిలిపోయింది. లేదర్ పార్క్, బెటాలియన్ కోసం కేటాయించిన భూములు ఆక్రమణలకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.

● లెదర్ పార్కు ఏర్పాటు చేయాలని దళితుల డిమాండ్

రుక్మాపూర్‌లో లెదర్ పార్కు ఏర్పాటు చేయాలని దళితులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇక్కడ మంజూరైన లెదర్‌పార్కును ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తుందనే ఆశతో దళితులు సీఎం ప్రకటనకోసం ఎదురు చూస్తున్నారు.

● పీజీ సెంటర్ నుంచి లెదర్ పార్కు వరకు...

1981లో పీజీ సెంటర్ కోసం రిజర్వ్ చేసిన ఈ ప్రభుత్వ భూములను తర్వాత అనేక పరిశ్రమలకు ప్రతిపాదించారు. 1983 ప్రొఫెలెంట్ ఫ్యాక్టరీని ప్రతిపాదించగా, అది కాస్త పంజాబ్‌కు తరలిపోయింది. ఆ తర్వాత స్పెషల్ పోలీస్ బెటాలియన్, పారిశ్రామికవాడ, ఐటీ పార్క్, ఐఆర్ బెటాలియన్, లెదర్‌పార్కు ఇలా అనేక ప్రాజెక్టులను ప్రతిపాదించారు. 2010లో పోలీస్ బెటాలియన్‌కు నిధులు మంజూరు కాగా, పనులకు భూమి చేశారు. ఈ పోలీస్ బెటాలియన్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు తరలిపోయింది.



నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 16: ధర్మపురి లక్ష్మీ నరసింహుని సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ట శుద్ద దశమి తోడుగా సెలవు దినం కావటం వల్ల క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుండి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో మూడు ఎడ్లు మృతి

బీర్‌పూర్, జూన్ 16: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మూడు ఎడ్లు మృత్యువాత పడ్డాయి. శనివారం రాత్రి ఈదురు గాలులకు తుంగూర్ కండ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. కండ్లపల్లి గ్రామానికి చెందిన నారపాక సుధాకర్, నారపాక లక్ష్మీనారాయణ, పూదరి రాయమల్లుకు సంబంధించిన ఎడ్లు మేత కోసం వెళ్తూ విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్ కొట్టి మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారులు మృతి చెందిన ఎడ్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్లాపూర్, జూన్ 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన గంధం లింగన్న(50)అను వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం లింగన్న కొన్ని రోజుల నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. ఈనెల 13న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. లింగన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.















అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం నందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

‘నాలా’ ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై ‘ఛలో మొబిలిటీ’కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మీ పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్డ్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని సీజ్ చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

గంజాయి రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సుల్తానాబాద్, జూన్ 16: డ్రగ్స్, గంజాయిరహిత రాష్ట్రమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి సమీపంలోని రైస్‌మిల్లులో జరిగిన చిన్నారి హత్యాచారం నేపథ్యంలో ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రైస్‌మిల్లును పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం మూలంగా రాష్ట్రంలో ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయని, రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లాలో జరిగిన చిన్నారి ఉదంతం అందరి హృదయాలను కలిచివేసిందన్నారు. గంజాయిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు సేవించిన వారు ఆ మత్తులో అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. రైస్‌మిల్లులో కూడా మత్తు సేవించడం వల్లనే బీహార్‌కు చెందిన కార్మికుడు బాలికను ఎత్తుకెళ్లి చంపేశాడని అన్నారు. తల్లిదండ్రుల వద్ద నిద్రపోతున్న బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి చంపేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, తనతోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారన్నారు. సీఎం ఆదేశాలతో తాము ఈ ప్రాంతానికి వచ్చామని, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు తమ పనితనాన్ని మరింత పెంచుకోవాలని, పెట్రోలింగ్ వ్యవస్థను విస్తృతంగా నిర్వహించుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి మత్తుకు బానిసలైన వారిని గుర్తించి, పనిపాటా లేకుండా మత్తులో మునిగితేలుతున్న వారు ఎక్కడ ఉన్నా వెతికిపట్టి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. నేర ప్రవృత్తి ఉన్న వారిపై నిఘా పెంచాలని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థను ప్రభుత్వం మరింత పటిష్ఠం చేస్తుందన్నారు.

ఘనంగా దుర్గా దేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోరుట్ల, జూన్ 16: పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ నిర్మించిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య సాగింది. అర్చకుడు అమ్మవారికి అర్చన అభిషేకం నిర్వహించారు. గణపతి హోమం, చండిహవన కార్యక్రమాలను నిర్వహించగా కాలనీకి చెందిన మహి ళలు విష్ణుశాస్త్ర, లలిత శాస్త్ర నామ, దుర్గాద్వాత్రింశ నామ శోత్ర పారాయణం చేశారు. అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, జూన్ 16: మండలంలోని కెల్లేడు గ్రామానికి రావుల చంద్రమౌళి (55) అనే వ్యక్తి ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రమౌళి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం తన పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై హత్యాచార ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం

- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం
- రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క



ఘటనపై సీపీ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు

సుల్తానాబాద్, జూన్ 16: సుల్తానాబాద్ రైస్ మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యా చార ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్ మిల్లులో జరిగిన ఘటనను తెలుసుకోవడానికి మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమ ణారావు, మక్కాన్‌సింగ్ తదితరులు ఆదివారం సుల్తానాబాద్‌కు వచ్చారు. ఘటనా స్థలాన్ని, రెండు రైస్ మిల్లులను పరిశీలించారు. కార్మిక దంపతులు నిద్రించిన స్థలాన్ని, నిందితుడు చిన్నారిని భుజాన వేసుకొని ఎత్తుకుపోయిన దారిని, నేర ప్రదేశాన్ని, మృతదేహం పడేసిన స్థలాన్ని వారు పరిశీలించారు. నేర ఉదంతం, నిందితుడిని పట్టుకున్న వైనం గురించి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసు, పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీలు రమేష్, కృష్ణ తదితరులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు విలేకరులతో మాట్లాడుతూ మిల్లులో పనిచేస్తున్న దంపతుల ఆరేళ్ల పాపను నిద్రలో నుంచి ఎత్తుకెళ్లిన నిందితుడు అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటన అందరినీ కలచివేసిందని, ఇది మానవ ప్రపంచం క్షమించరానిదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా వ్యవహరించిందని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ నిందితుడుని కఠినంగా శిక్షించేలా, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదేశాలు జారీచేశారన్నారు. ఆరేళ్ల పసిపాపను అతిక్రూరంగా చంపిన వ్యక్తి బీహార్‌కు చెందినవాడని, ఈ సంఘటన జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై పెద్దఎత్తున తనిఖీలు చేశారని, చివరకు నిందితుడిని పట్టుకున్నారని మంత్రి వివరించారు. చిన్నారిని ఎత్తుకుపోయిన గంటలోనే అత్యాచారం, హత్య జరిగిపోయిందని, అయినా ఆ గంట సమయంలో కూడా పెద్దఎత్తున గాలింపు చర్యలు, పాప ఆచూకీ ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంలోనే చిన్నారి మృతదేహం లభ్యమైందని, ఇది అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో సంఘటన సమాచారాన్ని తెలుసుకోవడానికి సోదరి మంత్రి సీతక్కతో కలిసి తాను సుల్తానాబాద్ వచ్చామని తెలిపారు. సంఘటన స్థలాన్ని స్వయంగా చూశామని, జరిగిన ఘోరం గురించి సీపీ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నామని అన్నారు. అయితే ఘటన జరిగిన తర్వాత ఎక్కడా కూడా ఆలస్యం కాకుండా పోలీసులు పాప ఆచూకీ కోసం ప్రయత్నించారని, కానీ దురదృష్టవశాత్తు కిరాతకంగా చిన్నారి హత్యకు గురైందని అన్నారు. ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

● **నిందితుడిపై చట్టపరంగా శిక్ష..**

చిన్నారిని అతికిరాతకంగా చంపిన మానవ మృగానికి చట్టపరంగా తగిన శిక్ష పడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ మేరకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అందుబాటులో ఉన్న ఆధారాలతో చట్టపరంగా నిందితుడిపై చర్యలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హత్యకు గురైన చిన్నారి తల్లిదండ్రులను కూడా కలిసి వారి నుంచి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు.

● **ప్రభుత్వ పరంగా చేయూత..**

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ప్రభుత్వం ద్వారా అందవలసిన ప్రయోజనాలను వారికి కల్పిస్తామని మంత్రులు శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో మిల్లు ఓనర్‌తో తక్షణ సాయంగా ఐదున్నర లక్షల రూపాయలు ఇప్పించారని, అలాగే ప్రభుత్వం ద్వారా తక్షణ ఎక్స్‌గ్రేషియా కింద మరో రెండున్నర లక్షల రూపాయలను ఇస్తున్నామని వివరించారు. దాంతో పాటు బాలిక తండ్రికి ప్రభుత్వ పరంగా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, వారి ఏడాది వయస్సు గల మరో చిన్నారి భవిష్యత్తుకు సంబంధించిన బాధ్యతలను కూడా ప్రభుత్వం చూస్తుందని వివరించారు. కాగా మంత్రుల వెంట ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం సీపీ శ్రీనివాసు, డీసీపీ చేతన, పెద్దపల్లి, రామగుండం ఏసీపీలు కృష్ణ, రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాష్‌రావు, అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, సారయ్యగౌడ్, మహేందర్, సతీష్, అబ్బయ్య, కిషోర్, రైస్‌మిల్లర్లు అశోక్, పల్లా మురళి, కేశవరావు, మారుతి, ప్రసాద్, రాజేశ్ ఉన్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

- ముస్తాబైన బిజిగిరిషరీఫ్ దర్గా
- మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

జమ్మికుంట రూరల్, జూన్ 16: మండలంలోని బిజిగిరిషరీఫ్‌లో బక్రీద్ సందర్భంగా ప్రారంభమయ్యే ఉర్సు ఉత్సవాలకు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి దర్గా ముస్తాబైంది. కులమతాలకతీతంగా పెద్ద సంఖ్యలోభక్తులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేయనున్నారు. పవిత్ర మక్కాను సందర్శిస్తే ఎంతటి పుణ్యం ప్రాప్తిస్తుందో ఇంకుషావళి దర్గాను సందర్శిస్తే అంతటి పుణ్యం దక్కుతుందని పూర్వీకులు చెప్పేవారు. ఇంకుషావళి దర్గాలో సోమవారం నుంచి బుధవారం వరకు ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ముతావళి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఉత్సవాలకు ముస్తాబైన సయ్యద్ ఇంకుషావళి దర్గా

● **దర్గా ప్రాశస్త్యం..**

బిజిగిరిషరీఫ్ దర్గాను 11వ శతాబ్దంలో నిర్మించారు. 864ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గల దర్గాలో హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహ్ అలై, ఆయన సోదరుడు హజ్రత్ సయ్యద్ అజ్మత్‌షావళి, వీరి కుమారులు హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావళి సమాధులున్నాయి. జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో విశాలమైన గుట్టలు, ప్రకృతి రమణీయతల ప్రాంతంలో ఈ దర్గా ఉంది. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్‌లోని సూక్తులను వివరిస్తూ అరబ్ దేశం నుంచి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ హజ్రత్ ఇంకుషావళి బిజిగిరిషరీఫ్‌కు చేరుకున్నాడు. మానవత్వమే విశ్వమతమని చాటే ఇంకుషావళి జీవితకాలం మొత్తాన్ని ఇక్కడే గడిపారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఏటా జిల్‌హజ్ మాసంలో 17/06/2024 నుంచి మూడు రోజుల పాటు ఉర్సు నిర్వహిస్తారు. నిష్ఠతో ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోర్కెలు ఇంకుషావళి తీరుస్తారని ప్రసిద్ధి.


● **ఉత్సవాల్లో భాగంగా..**

ఉర్సు ఉత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావళి మహ్మద్, దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో చాదర్‌గుల్ కార్యక్రమంలో భాగంగా దర్గా ముజా వర్లు చాదర్లతో సమాధులను అలంకరిస్తారు. బక్రీద్ పర్వదినంలో ముఖ్య ఘట్టమైన షరీఫ్(గ్రంథలేపనం)కు మొల్లపల్లె, పెద్ద బిజిగిరిషరీఫ్ గ్రామాల నుంచి మేళతాళాల మధ్య సందల్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చి సమాధులకు అలంకరిస్తారు. మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను ఆలపిస్తూ ఖవ్వాలి జరుపుతారు. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పర్వీన్ షాహదతి, నాందేడ్‌కు చెందిన మహ్మద్ సలీమ్‌పాషా బృందం ఖవ్వాలి ఆలపించనున్నారు.

● **దర్గా కమిటీ ఆధ్వర్యంలో..**

దర్గా కమిటీ ఆధ్వర్యంలో దర్గా, మినార్లు, చారిత్రక కట్టడాలకు రంగులు వేయించారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్యం, విద్యుత్, వసతి సౌకర్యాలను దర్గా కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశికరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమళ్ల విజయ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తదితరులు హాజరుకానున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



సంతోష్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 16: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో పచ్చకాంతుల సంతోష్ (35) అనే పురోహితుడు ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. సంతోష్ గ్రామంలో పురోహితం చేస్తూ భార్యాపిల్లలను పోషిస్తుండేవాడు. ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న సంతోష్ జైలు నుంచి బయటకు వచ్చి హైదారాబాద్‌లో ఉంటున్నాడు. అక్కడ పురోహితం చేస్తూ ఒంటరిగా ఉంటూ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడంతో పాటు కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. పలు మార్లు పంచాయితీ నిర్వహించి పద్ధతి మార్చుకోవాలని పెద్దలు మందలించినా మార్పు రాలేదు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఆస్తి విషయంలో సంతోష్‌కు ఆ కుటుంబ సభ్యులతో తగదా చోటు చేసుకుంది. ఆదివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. భయంతో కుటుంబ సభ్యులు పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వెళ్లిపోయారు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన సంతోష్ పాత ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 16: ఉమ్మడి జిల్లా టుడే లీగ్స్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నెట్స్‌లో ఉదయం 7.30గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కె.మహేందర్ గౌడ్, పి.మనోహర్‌రావులు తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ మెమో, బోనోఫైడ్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫొటోలు, స్వంత క్రికెట్ కిట్, పూర్తి యూనిఫాంతో హాజరు కావాలని తెలిపారు. 28సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టుడే లీగ్స్ జట్టు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8688768775 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్యం మత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేసిన వ్యక్తి

-కుల పెద్దల జోక్యంతో క్షీరాభిషేకం

కరీంనగర్ రూరల్, జూన్16: మద్యం మత్తులో ఒక వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేసిన ఘటన కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. నగునూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం మత్తులో గ్రామ చావడి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేశాడు. ఇది చూసిన స్థానికులు అంబేద్కర్ సంఘం నాయకులకు తెలిపారు. దీంతో ఆ వ్యక్తిని కుల పెద్దలు, ఎంపీటీసీ అంకమల్ల శ్రీనివాస్‌లు పిలిపించి క్షమాపణ చెప్పించారు. అనంతరం ఘటనకు పాల్పడిన వ్యక్తితో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయించారు.

ఉత్తమ సాహిత్యంతోనే సమాజ వికాసం

కరీంనగర్ కల్చరల్, జూన్ 16: ఉత్తమ సాహిత్యంతోనే సమాజ వికాసం జరుగుతుందని కథా రచయిత, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత పెద్దింటి అశోక్‌కుమార్ అన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో క్రైం కథల పోటీల ద్వారా సేకరించిన కథలతో రూపొందించిన 'మరణం వరమైన వేళ' పుస్తకావిష్కరణను ఆదివారం భగత్‌నగర్ భగవతి స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ మనిషి ఎలా బతకాలో సాహిత్యం నేర్పుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కవి, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కార గ్రహీత ఐతా చంద్రయ్య, తెరవే రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు గాజోజు నాగభూషణం మాట్లాడారు. స్తంభంకాడి గంగాధర్ పుస్తక పరిచయం చేశారు. క్రైం స్టోరీస్ కథల పోటీల్లో విజేతలైన పివివి సత్యనారాయణ, ఎన్‌వి శ్రీధరశర్మ, ఎంవి చంద్రశేఖర్‌రావు, పారుపల్లి అజయ్‌కుమార్‌లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించి సన్మానించారు.

బస్టాండ్ ఆవరణలో డెలివరీ చేసిన 108 సిబ్బంది

భగత్‌నగర్, జూన్ 16: మధ్యప్రదేశ్‌కు చెందిన గర్భిణికి బస్టాండ్ ఆవరణలో 108 సిబ్బంది డెలివరీ చేశారు. దంపతులు కుంట-భద్రాచలం వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. కొద్దిసేపటికే ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆమె భర్త ఆర్‌టీసీ అధికారులకు తెలియచేయగా వారు 108కు ఫోన్ చేశారు. బస్టాండ్‌కు చేరుకున్న 108 సిబ్బంది, ఆర్‌టీసీ మహిళ సిబ్బంది సహాయంతో బస్టాండ్ ఆవరణలోనే ఆ మహిళకు కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో అనంతరం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్యాచార నిందితుడిని ఉరి తీయాలి

గణేశ్‌నగర్, జూన్ 16: పెద్దపల్లి జిల్లాలో 6 సంవత్సరాల పాపను హత్యాచారం చేసిన నిందితుడిని ఉరి తీయాలని ఆదివారం గీతాభవన్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కోట శ్యాంకుమార్, బెల్లపు కరుణాకర్, కొల్లూరి కుమార్, అనిల్‌రావు, పిట్టల మహేష్, వి.రమణాచారి, గుణశీల్, రాజు, కుకట్ల కుమార్‌స్వామి, దేశెట్టి రాజు, మాదాసు సుమన్, బెల్లపు శివ, అద్దునూరి రోహిత్, బూత్కూరి అఖిల్ పాల్గొన్నారు.

అరుంధతి రాయ్‌కి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి

భగత్‌నగర్, జూన్ 16: పది సంవత్సరాల క్రితం చేసిన వాఖ్యలను బూచిగా చూపుతూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉపచట్టం క్రింద అరుందతి రాయ్‌కి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై గొంతెత్తి ప్రశ్నించే మేధావి వర్గాన్ని కావాలని కుట్రపూరితంగా అణచివేయాలని బీజేపీ ఇలాంటి వేదింపులకు పాల్పడుతుందన్నారు.

దేశంలో బీజేపీ ఇలాంటి ఫాసిస్ట్ విధానాల వల్ల అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తులను నిర్బంధిస్తే దేశ అభివృద్ధికి నష్టం అన్నారు. బీజేపీ నిరంకుశ విధానాలను ప్రజానికం నిరసిస్తూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అరుంధతిరాయ్ విచారణ అనుమతిని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. స్థలం లేని నిరుపేదలకు 200 గజాల స్థలం కేటాయించి, నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10లక్షలు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యా శ్రీనివాస్, సుంకరి సంపత్, జి రాజేశం, డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి'

చొప్పదండి, జూన్ 16: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయాలని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనా రాయణ అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. హామీలను నెరవేర్చని పక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు



బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్, జూన్ 16: హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ నాయకులపై సోషల్ మీడియా వేదికగా అసత్యప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం టౌన్ సీఐ బొల్లం రమేశ్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా కావాలని కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.. కార్యక్రమంలో సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, మహేందర్‌గౌడ్, తిరుపతి, శంకర్, బాబు, రాజు, రాహుల్, లావణ్య, పుష్పలత, రమేష్, బిక్షపతి, సుశీల, రాధ, రవీందర్, అయిలయ్య, నాగరాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ

జమ్మికుంట రూరల్, జూన్ 16: కోరపల్లి గ్రామ అఖిల భారత యాదవ సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్కతట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గిరవేన శంకర్, ప్రధాన కార్యదర్శిగా నల్లగాశ నరేష్, కోశాధికారి గిరవేన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులు కూకట్ల కుమార్, గిరవేన సమ్మయ్య, కార్యదర్శి గిరవేన కుమార్, గిరవేన కొంరయ్య, సంయుక్త కార్యదర్సులు గిరవేన అయిలయ్య, గిరవేన రంజిత్, సహాయ కార్యదర్సి ఉడుత శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో ఆలయానికి వెళుతున్న గ్రామస్థులు

వీణవంక, జూన్ 16: మండలంలోని వల్భాపూర్‌లో మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గొల్ల కురుమ కులస్తులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. యాదవ కుల మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకుని ఒగ్గు డోళ్ళ చప్పుళ్ళతో, శివసత్తుల పూన కాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్

గణేశ్‌నగర్, జూన్ 16: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన విద్యాశాఖ మంత్రి లేకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వస్కూల్, కాలేజీలలో తగిన సౌకర్యాలు కల్పిం చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేట్‌స్కూల్, కాలేజీలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి యాజ మాన్యాల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం పటేల్, బీసీ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాటా వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొని శ్రీనివాస్, పలువురు బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారి సూచనతోనే తప్పుడు కేసులు

-సీపీకి బహిరంగలేఖలో కొత్తజైపాల్‌రెడ్డి

కరింనగర్ క్రైం, జూన్ 16 : హుస్నాబాద్‌లో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి సూచనతోనే ఈఓడబ్ల్యూలో పనిచేస్తున్న పోలీసు అధికారి తనపై తప్పుడు కేసులు నమోదు చేశారంటూ కొత్త జైపాల్‌రెడ్డి కరీంనగర్ సీపీకి రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఈ బహిరంగలేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. తనపై కక్ష కట్టి తప్పుడు కేసులు నమోదు చేసినట్టయితే తాను కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తానని, తప్పుడు కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు.

తనపై ఫిర్యాదు వచ్చినప్పుడు విచారణ నిమిత్తం ఏ పోలీసు అధికారి కూడా తనకు ఫోన్ కాల్ చేయలేదని, తన వాదనలు వినలేదన్నారు. తనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈఓడబ్ల్యూలో పనిచేస్తున్న అధికారులు కాకుండా ఇతర అధికారుల ద్వారా విచారణ జరిపించేందుకు నిజ నిర్ధారణ కమిటీ వేయాలని జైపాల్‌రెడ్డి కోరారు.

రోడ్డుపై దర్జాగా బోరు

కరీంనగర్ టౌన్, జూన్ 16: నగరంలోని మంకమ్మతోటలో ఓ ఇంటి యజమాని ఆదివారం రోడ్డుపై దర్జాగా బోరు వేశాడు. అసలే ఆ రోడ్డు ఇరుకు... రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు, జనం రద్దీతో ఆ గల్లి నుంచి ఇతర గల్లీలకు వెళ్ళే వారు ఇబ్బందులు పడుతున్నారు.నగరంలోని మంకమ్మతోటలో రోడ్డుపై బోరు దర్జాగా వేయడంతో స్థానికులు ఈ విషయాన్ని డివిజన్ కార్పొరేటర్‌కు, మేయర్‌కు, మున్సిపల్ అధికారులకు సమాచారమిచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో కొంత ఆలస్యంగా మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకొని బోరువేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేయగా అధికారపార్టీ నేత సమీపబంధువు మున్సిపల్ సిబ్బందిని వెళ్ళి పోవాలని హుకూం జారీ చేయడంతో వారు వెనుదిరిగి వెళ్ళినట్లు ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఇరుకుగా ఉన్న రోడ్డుపై దర్జాగా బోరువేయడమేంటని, ఇలాంటి వాటిని ఎలా ప్రోత్సహిస్తారని, రోడ్డు ఇరుకుగా మారకుండా రోడ్డుపై వేసిన బోరుబావిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

'మంత్రిపై అసత్య ఆరోపణలు'

కరీంనగర్ అర్బన్, జూన్16: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ కార్యదర్శి రహెమత్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ మంత్రిని ఓర్వలేక ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మరోసారి ఇటువంటి ఆరోపణలు చేస్తే రాజకీయంగా బొందపెట్టడం ఖాయమన్నారు.

●గణేశ్‌నగర్, జూన్ 16: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీసీ సంఘాల పక్షాన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని హెచ్చరించారు.

కరీంనగర్ నగర బీసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మాల్లేశం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, కాట వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో 'ప్రజావాణి'

- ప్రతి సోమవారం నిర్వహణ

గణేశ్‌నగర్, జూన్16: ఎస్పీడీసీఎల్ విద్యుత్‌శాఖ ప్రజావాణి కార్యక్రమం చేపట్టనుంది. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తోంది. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై ప్రతి సోమవారం విద్యుతు అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అదే రోజు విద్యుత్తు వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తారు. త్వరగా సమస్యను గుర్తించి పరిష్కరించడానికి కృషి చేస్తారు.

క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి..

-ఎస్ఈ గంగాధర్

విద్యుత్తు వినియోగదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలనే యోచనతో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. విద్యుత్ వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఎక్కడి సమస్యలకు అక్కడే ఫిర్యాదు అందేలా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రజావాణి కార్యక్రమంతో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి



ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, జూన్ 16: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో, ఘనంగా జరుపుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం ఆయన ఎంఐఎం నాయకులతో కలసి సాలెహ్‌నగర్ ఈద్గాలో బక్రీద్ ఏర్పాటన్లు పరిశీలించారు. నగర వ్యాప్తంగా పురానీ ఈద్గాతో పాటు సాలెహ్‌నగర్, చింతకుంట, రేకుర్తి, మానేరు సమీపంలోని ఈద్గాలలో నగర పాలక సంస్థ ద్వారా 22 లక్షల నిధులతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని అన్నారు. ఈద్గాలలో ఎలువంటి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈద్గాలను పరిశుభ్రం చేయడంతో పాటు చలువ పందిళ్ళు, టెంట్లు, గ్రీన్ కార్పెట్లు, తాగు నీరు తదితర ఏర్పాట్లు చేశామని అన్నారు. పోలీస్, ఫైర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలందిస్తారని తెలిపారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణాగౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, ఎంఐఎం నాయకుడు సయ్యద్ హమీద్ హుస్సేన్, షకీరా అంజూమ్, బర్కత్ అలీ, గౌసియాబేగం, షరీపొద్దీన్, అఖిల్‌ఫిరోజ్, అజార్, అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బావుపేటలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భగత్‌నగర్, జూన్16: కొత్తపల్లి పట్టణంలో 1998-99 ఎస్ఎస్‌సి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనాడు పాఠాలు నేర్పిన గురువులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తమ ఎస్సెస్సీ బ్యాచ్‌లో ఆర్మీలో ఉద్యోగి చేసి రిటైర్డ్ అయిన మండల అమరేందర్‌రెడ్డిని సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో లయోల స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ జోసఫ్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, ప్రసాద్, సల్మాన్ రాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

●కొత్తపల్లి మండలం బావుపేటలో జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న 1991-92 సంత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమయ్య, జలపతిరావు, లక్ష్మయ్య, చంద్రయ్య విద్యార్థులు పవన్, శ్రీధర్‌రావు, తిరుపతి, లక్ష్మణ్, ప్రభాకర్, శ్రీనివాస్, సుజన, వనజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పని కల్పించాలి

- చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్

గంగాధర, జూన్ 16: పవర్‌లూమ్స్ పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు పని కల్పించాలని తెలంగాణ చేనేత ఐక్యవేధిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేధిక మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, గర్శకుర్తి వస్త్రోత్పత్తి వ్యాపారులు, కార్మిక, పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో నేతన్నల వెతలపై ఆదివారం చర్చాగోష్టి నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ జీయో టాగ్ విధానంతో నిమిత్తం లేకుండా పవర్ లూమ్స్ పరిశ్రమలలో పని చేసే ప్రతి చేనేత, పవర్ లూమ్స్ కార్మికులకు ప్రభుత్వం చేతినిండా పని కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది నెలలుగా పవర్ లూమ్స్‌పై వస్త్రోత్పత్తులు నిలిపోయి పవర్‌లూమ్స్ యాజ మానులు, ఆసాములు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులు లేక అవస్థపడుతున్న కార్మికులకు పరిశ్రమలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సంక్షభంలో ఉన్న వస్త్ర పరిశ్రమ, పవర్ లూమ్స్‌పై విజిలెన్స్ దాడులు జరగకుండా ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని, పనులు లేక అవస్థలు పడుతున్న నేతకా ర్మికులకు పనులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని భరోసా కల్పించారు. చేనేత, పవర్ లూమ్స్ పరిశ్రమల బాగోగులు తెలుసుకోవడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఐక్యవేధి క పక్షాన పర్యటిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల ఇబ్బందులు సమస్యలను ఒక నివేదికగా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. త్రిఫ్ట పథకం ప్రభుత్వం ఎనిమిది నెలలుగా డబ్బులు జమచేయక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఈ పథకాన్ని ప్రభుత్వం యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నేతన్న భరోసా పథకం కింద పనులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేనేత ఐక్యవేధిక నాయకులకు ఇచ్చిన హామీ అమలు చేసేవరకు ప్రభుత్వ వెంటపడుతామని తెలిపారు. కార్యక్రమంలో చేనేత రాష్ట్ర ఐక్యవేధిక రాష్ట్ర, జిల్లాల నాయకులు చిందం అంకారపు సునిత, సదానందం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మైసయ్య, ఆశన్న, శ్రీనివాస్, రంజీవి, భాస్కర్, నారాయణ, శారద, రమాదేవి, పద్మ, రాజమౌళి పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన

హుజూరాబాద్, జూన్ 16: హుజూరాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించే బక్రీద్ ఏర్పాట్లను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశిం చారు. ముస్లింలందరూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

'అరుంధతీరాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి సరికాదు'

జమ్మికుంట, జూన్ 16: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద విచారణ జరిపేందుకు అనుమతించడం సరికాదని సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడే గొంతులను అణివేయాలని బీజేపీ ప్రభుత్వం బావిస్తోందని, ఈ విధానాలు మానుకోవాలని కోరారు.

విద్యార్థినికి మంత్రి అభినందన

చిగురుమామిడి, జూన్ 16: మండల కేంద్రానికి చెందిన దాసరి సిరి వైష్ణవ్య చిన్న ముల్కనూర్ మోడల్ పాఠశాలలో చదివి పదో తరగతిలో 10 జీపీ సాధించిన సందర్భంగా ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆమెను అభినందించారు.. ఆయన వెంట కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, ఎస్సై బండి రాజేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, కర్లకంటి మంజులరెడ్డి, సాంబారిబాబు, బోయిని సురేష్ తదితరులు ఉన్నారు.

వాసవీమాతకు నివాళి

హుజూరాబాద్, జూన్ 16: హుజూరాబాద్ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద చౌరస్తా వద్ద వాసవీ మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐదుగురికి బ్లైండ్ స్టిక్స్ అందజేయడంతో పాటు 40మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పండ్లు అందజేశారు. ఒక పేద వ్యాపారికి తోపుడు బండిని అందజేయడంతో పాటు, ట్రాఫిక్ పోలీసులకు ఫ్లోరాసెట్ జాకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం వెంకటసుబయ్య, గంప సురేందర్, అయిత రమ, లచ్చయ్య, ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, శైలజ, గోలి హిమబిందువు, శివనాధుని స్వప్న, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్ 16: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల క్యాంపు(ప్రజా భవన్) కార్యాలయంలో బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం

జమ్మికుంట, జూన్ 16: నేత్రదానం అభినందనీయమని, అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని జడ్పీ చైర్‌పర్సన్ కనుమళ్ల విజయ అన్నారు. ఆదివారం జమ్మికుంటలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు నరహరి ఆధ్వర్యంలో నేత్రదాత గుండా తిరుపతయ్య సంస్మరణ సభ నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజహితం కోసం తపించే తిరుపతయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్సి భీష్మాచారి, ఓదెల మండల అధ్యక్షులు డాక్టర్ వేణు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర మాజీ కోఆర్డినేటర్ మృతి

గణేశ్‌నగర్/కరీంనగర్ కల్చరల్, జూన్ 16: కరీంనగర్ జిల్లా ఎల్బాక గ్రామానికి చెందిన వేముగంటి రామారావు (78) నెహ్రూ యువ కేంద్ర మాజీ కోఆర్డినేటర్ ఆదివారం ఉదయం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ హయాంలో న్యూఢిల్లీలో నవోదయ విద్యాలయ సంఘటన్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఉత్తరాంచల్ ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరించారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు కరీంనగర్‌లో జరగనున్నాయి.

కారు చోరీ

కరీంనగర్ క్రైం, జూన్16: కరీంనగర్ భాగ్యనగర్‌లో గుర్తు తెలియని దొంగలు ఒక మహీంద్రా కారును ఎత్తుకు పోయారు. రాయల్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసి ఉన్న మహీంద్రాకారు శుక్రవారం రాత్రి 10 గంటలకు చోరీ అయినట్లు బాధితులు గుర్తించి రెండో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి వారిని పట్టుకునేందుకు ప్రత్యేకటీంను రంగంలోకి దించారు. కాగా భాగ్యనగర్, సంతోష్‌నగర్, చైతన్యపురి కాలనీ ప్రాంతాల్లో గత నాలుగు రోజులు వరుసగా చిల్లర దొంగతనాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. పలు ఇళ్లల్లో, ఆరుబయట ఉన్న గ్యాస్‌సిలిండర్లు, బియ్యం బస్తాలు, సైకిళ్లు, లిఫ్టిగేట్ తదితర విలువైన వస్తువులు, సామాగ్రిని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో పలు చోట్ల వరుస దొంగతనాలు జరుగుతుండటంపట్ల నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ పోలీసు గస్తీని పెంచి, దొంగలను త్వరగా పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎస్పీలో చేరిక

సుభాష్‌నగర్, జూన్ 16: బీఎస్పీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం సమక్షంలో శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన యునీస్ బీఎస్పీలో చేరాడు. యునీస్ గతంలో మొలంగూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడికి పనిచేశారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దొడ్డే శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, జూన్ 16: నగరంలోని 59,60 డివిజన్ల పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 59వ డివిజన్ అధ్యక్షునిగా గౌడ పరందాములు, ప్రధాన కార్యదర్శిగా గాజర్ల రఘు, కోశాధికారిగా మామిడి దామోదర్, ఉపాధ్యక్షులుగా గుండ్లపల్లి అంజయ్య, మంచికట్ల బుచ్చయ్య ఎలగొండ లక్ష్మీపతి, కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం రమేశ్, ప్రచార కార్యదర్శిగా పచ్చునూరి ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు.

● 60వ డివిజన్ అధ్యక్షునిగా గాజర్ల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షునిగా గుంటుక రామచంద్రం, ప్రధానకార్యదర్శి గాలి నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎలగొండ నారాయణ, అనుమల్ల అశోక్‌లను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధానకార్యదర్శి వంగర అంజనేయులు, ఉపాధ్యక్షులు తెల్ల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కస్తూరి వాసుదేవ, నల్ల శ్రీధర్, వెనగంటి సందీప్, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వీపర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, జూన్ 16: జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే సజ్జద్ ఇటీవల గుండె పోటుతో మరణించాడు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది కొంత మొత్తాన్ని సేకరించారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత చేతులు మీదుగా రూ. 29,000 అతని కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఖాదర్, సూపరింటెండెంట్లు రాజనరేందర్, అఫ్జల్, దివ్య, పాండురంగారావు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

కరీంనగర్ అర్బన్, జూన్ 16: టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన మానేరువాకర్స్ సభ్యుడు గూడ ప్రభాకర్ రెడ్డికి ఆదివారం ఉదయం కరీంనగర్ మానేరు డ్యాం కట్ట వద్ద మానేరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మానేరువాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 16: శంకరపట్నం మండలం లింగాపూర్‌లో ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైర్ పై నుంచి పోయిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎడ్ల సమ్మయ్య తన ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్‌ను, ఇంజన్ టైర్ పక్కన ఉంచి స్టార్ చేశాడు. గేర్‌లో ఉన్న ట్రాక్టర్ ముందుకు కదిలి ట్రాక్టర్ టైర్ ప్రమాదవశాత్తు సమ్మయ్యపై నుంచి పోయిందని తెలిపారు. ఈ ఘటనలో సమ్మయ్యకు తీవ్ర గాయాలు కాగా హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

మానకొండూర్, జూన్ 16 : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన దాసరి తిరుపతి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన అనిల్ ఆదివారం దాడికి పాల్ప డడంతో కేసు నమోదు చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద తిరుపతికి, అనిల్‌కు వాగ్వాదం జరిగిందని చెప్పారు. దీంతో అనిల్ తిరుపతిని ఇటుకతో తలపై కొట్టి గాయపర్చాడు. బాధితుడు పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక ,జూన్ 16: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా మానేరు వాగు నుంచి ఇసుక రవాణ చేస్తున్న మూడు ఇసుక టాక్టర్లను ఎస్సై తోట తిరుపతి పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్లు ఓరేం సుగుణకర్, రెడ్డిమల్ల రాజయ్య, రాజు, ఓరేం అమృతయ్య, ప్రదీప్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలి

రామడుగు, జూన్ 16: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయం పునఃనిర్మాణానికి మాజీ సర్పంచ్ అడ్డుకుంటున్నారనిమంత్రికి తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గన్నేరువరం, జూన్ 16: మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమం లో తిరుపతిరెడ్డి, పర్శరాంరెడ్డి, సులోచన, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గన్నేరువరం, జూన్ 16: మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన జక్కనపల్లి రాజమల్లు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందగా అతడితో 1994-95లో పదో తరగతి చదివిన స్నేహితు లు ఆదివారం బాధిత పరామర్శించారు. బియ్యం, 5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్, జగన్, విజ యేందర్, అంజయ్య, చంద్రం, రాజేందర్‌చారి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.